


శవాలను లాక్కెళ్ళుతున్న చీమలు. రక్తం మరకగా మారి, పొట్టుగా మిగిలి విగత జీవులైన శవాలు. పొట్టును నోట్లో కరచుకొని బరబరా అంత సునాయాసంగా పాకుతున్న నల్లచీమలు.

పొట్ట ఉబ్బి నడవలేక నడవలేక నిలుచున్న రక్తంముద్ద. ఆత్మారావు కసినంతా పురజుకొని బొటనవేలుతో గోడకు చిదివి వేశాడు. అమూర్తమైన ఒక కళ ఆవిర్భవించింది. నల్లి పొట్ట ఖాళీ జనపనార సంచిలా ఊడిపడింది.

ఆత్మారావు కోపంతో మరోసారి తల వెంట్రుకలను పీక్కున్నాడు. చేతి వేళ్ళు అప్పటికే నల్లుల రక్తం బురద వాసనతో కంపుకొడుతున్నాయి. భయం వేసింది. ఈ వేళ్ళు నిద్రలో అనుకోకుండా కళ్ళను పులిమితే?....కళ్ళు నల్లుల్లా ఉబ్బి విషాన్ని తాగి చివరికి చూడడం మానేస్తాయి,

చివరికి హాయిగా నిద్రపోదామన్నా నిద్రపోనివ్వని వెధవ నల్లులు—మనిషికి జీవితాంతం తటస్థపడే ఆజన్మ శత్రువులు.

ఆత్మారావు ఆత్మ ఘోషించింది నిద్ర రాక. అలసటవల్ల ఆవులింతలే తప్ప సరాల గుంజాటనే తప్ప నల్లులవేట ఆగిపోదు—యీ రాత్రి ఇలా ఠరల్లో ఇంకిపోదు. మిగిలిన ఇదైనా దక్కకుండా పోతోంది. అదృష్టవంతులు, అంటే డబ్బులున్న జేబులు, వర్ణించిన నిదురకన్నెలను ఈ

నల్లుల సాయెబులు చెరచి చెరబడు తున్నారు.

ఆత్మారావుకు ఆ అర్థరాత్రి నల్లుల మరకల మధ్య చితికిపోయిన పగలు కన పడింది.

ఆరోజు మధ్యాహ్నం వరకు తిరిగి, తిరిగి, కనిపడిన స్నేహితుణ్ణల్లా అప్పు అడిగి లేదనిపించుకొని, ఒక చౌరస్తాలో బస్సు దిగాడు. కాళ్ళు కదలడం లేదు, అన్నం లేదనిపించుకొని ఎటు కదలాలో తోచని కుంటి బిచ్చగాడి కాళ్ళల్లా—చాలా సేపు నిలబడిపోయాడు.

అక్కడే తనతో దిగిన డ్రైవర్లు, కండక్టర్లు మాసిన గడ్డాలతో, కాకీ దుస్తులతో బస్సుల్లా కదలివెడుతున్నారు.

తను అప్పుకోసం ప్రతి చిల్లుపడిన కుండలోకి తొంగి చూసి, ఎడారిలో నిలుచున్నాడు.

పాపం! ఆత్మారావు ఒక కవి. కాదు కాదు, నెల నెలా వడ్డీలు కట్టడంకోసం అప్పుచేసే ర చ యి త. డబ్బుకోసం మాత్రమే రచనలు చేసే రచకుల మధ్య బక్కచిక్కి చతికిలబడ్డ నల్లి అతను. ఆ విషయం తనకు బాగా తెలుసునని అప్పుడు ఆ చౌరస్తాలో అనుకున్నాడు. తలలో అవిటితనం ఇంకా వెక్కిరిస్తూనే వుంది.

ఆ రోజు ఉద్యోగానికి సెలవుపెట్టి, అప్పు వేటకు బయలుదేరిన ఆత్మారావు ఒక ఉపాధ్యాయుడు. ఈ ఉద్యోగంలేకుంటే చివరికి ఆ బక్కచిక్కిన బొక్కలు కూడా మిగిలేవు కావు. తనలోని కవి—రచయిత పవిత్రమైన ఈ మట్టిలో కలిసి రోజూ దుమ్ముగా లేచి, చివరికి ఎక్కడో నిలుచున్న కారు పైకి పాకి పొరగా మిగిలి పోయేవాడు.

మరిలేకపోతే, తాను అంత వొళ్ళు హూనం చేసుకొని రాసిన నవల కూడా తన వడ్డీలను ఆదుకోలేదు.

ఆ రోజు ఉదయమే వెళ్ళి వచ్చాడు శాస్త్రి దగ్గరికి. వడ్డీ వ్యాపారం చేసే శాస్త్రి తనకు కొన్నేళ్ళ క్రితమే అప్పుపెట్టాడు. ఇన్నేళ్ళు అయినా ఇంకా వడ్డీ బాకీ మిగిలి వుంది. "అసలు" మాట తానే మరచి పోయాడు. ఇప్పుడు మళ్ళీ ఈ నెల బాకీ లను అడ్డుకోవడానికి అప్పు కావాలి.

ఎవరు ఇస్తారు? వడ్డీ ఆశ వున్న వాళ్ళందరు యిస్తారు. అందులో వడ్డీఆదా యంపైననే కుటుంబాన్ని పెంచుతున్నశాస్త్రి తప్ప కుండా ఇస్తాడని నమ్మకం. మొదలు ఇద్దరుముగ్గురు తెలిసిన వాళ్ళదగ్గిరికి వెళ్ళి లేదనిపించుకుని, శ్మశానం నుండి తిరిగి వచ్చిన ముఖంలా ఘనీభవించి నడుస్తు న్నాడు.

శాస్త్రి ఇంట్లో అడుగుపెట్టాడు ఆత్మా రావు. ఎదురుగా ఖాళీ కుర్చీలు. ఆ గది నాలుగు గోడలకు అవల మరో గదిలో పూజాపాఠాలు వల్లెవేస్తున్న చప్పుడు. 'హో! హో! శాస్త్రిగారు పూజలో వున్నా రన్నమాట,' అని అనుకున్నాడు ఆత్మా రావు.




అక్కడే వున్న ఆనాటి తెలుగు దిన పత్రిక తీసి తిరగేశాడు. అలుక్కుపోయిన గుండ్రటి నల్లని అక్షరాలు చిన్న పొట్టతో నిండా రక్తం తాగి, నల్లగా కదలలేని నల్లిపిల్లలు ఆత్మారావు చేయి అనుకోకుండా పేపర్‌పై కసిగా రుద్దపోయింది. అది పేపర్ అనే సంగతి వెంటనే జ్ఞాపకం రాగానే అరచేయిని తమాయించుకున్నాడు పట్టూ చూశాడు, పొడుగాటి వెడల్పాటి గోడలపైకి. ఎక్కడైనా నల్లుల మరకలు కనపడతాయేమోనని మరీ చూశాడు. ఆ ఛాయలు కనపడకపోయేసరికి, 'మరీ అదృష్టవంతుడు శాస్త్రి,' అనుకున్నాడు ఆత్మారావు.

ఎర్రని శాలువ కప్పుకొని అప్పుడే గదిలోకి వచ్చిన శాస్త్రి కళ్ళు దళసరి అద్దాల వెనుక చిట్లించుకున్నాయి. ఏదో చిరునవ్వును అంటించుకొని శాస్త్రి, "రావుగారా? ఎప్పుడు వచ్చారేమిటి?" అన్నాడు.

ఏదో అనబోయి ఎండిన నవ్వు నవ్వాడు ఆత్మారావు పక్కనే వచ్చి కూచున్నాడు శాస్త్రి. ముక్కు కింద గండుచీమల్లాంటి హిట్లర్ కట్ మీసాలు మొదలు జవాబుగా నవ్వాయి. ఆ తర్వాత నొసలు ముడతలు పడి వెక్కిరించింది

"హూఁ చెప్పండి! ఏదో పనిమీద వచ్చినట్టున్నారు?" శాస్త్రి గొంతు గాంభీర్యాన్ని నటిస్తూ అడిగింది.

ఆత్మారావు నసుగుతూ-నీళ్ళు గొంతులోకి దిగినట్టు- "మరేం లేదండి . .మరో వందరూపాయలు సర్దుతారేమోనని ...మరీ గొంతు మీదికి వచ్చింది అవసరం... !"

"ఎట్లాగండి! పాత అప్పు అలానే వుండిపోయే! వడ్డీ బాకీ కూడా వుందాయే! అయినా ఇప్పుడు, పదో తేదీ దాటిన తర్వాత, డబ్బు వుంటుందా?" ఏదో కారణం చెప్పి తప్పించుకోవాలని చూశాడు శాస్త్రి.

ఆత్మారావు తన గొంతులోని లోతైన బావిలోకి దిగిపోయి, "మీపై పెద్ద ఆశతో వచ్చాను మరి! ఏమైనా ప్రయత్నిస్తే...." అన్నాడు.

శాస్త్రి కాస్సేపు కిందికి చూశాడు. అద్దాలు సర్దుకుని గొంతు కాస్త పెద్దచేసి, "ఎట్లా మరిప్పుడు! అందులో వంద రూపాయలు కదా! అంత మొత్తం లేదే! వచ్చే నెల చూద్దాం!" అన్నాడు.

ఆత్మారావుకు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆరోజు సాయంత్రం వస్తానన్న వంజరి వడ్డీ వ్యాపారి కాంతయ్యా ముఖం తన కనుబొమల మధ్య నిలుచుంది.

"అది సరే! ఈ మధ్య ఏమైనా కొత్తయి రాశారా?" కవిని కదిలించి తృప్తి పరుద్దామనుకున్నాడు శాస్త్రి.

ఆత్మారావు అయిష్టంగా గింజుకొని నూతిలోంచి జవాబిచ్చాడు: "ఏముంది వ్రాయడానికి? వాస్తవ జీవితం దోహదం చేస్తే కదా?"

"అందులో కవులు, రచయితలు ఏమి చేస్తారు లెండి? ఈ సంఘంను ఉద్ధరిస్తామని పాపం వ్రాస్తారు. కాని ఒక పెద్ద రచయిత చెప్పినట్టు ఈ సంఘం ఒక దున్నపోతు సుమండి! పైన ఎంత వాన పడ్డా సరే—కదలదు!" శాస్త్రి ముఖం ఏదో ప్రవచనం వినిపిస్తున్న స్వాములవారి వర్చస్సుల్లా వెలిగిపోయింది.

ఆత్మారావు అసమర్థత అభిమానం కింద గిలగిలా తన్నుకొంది. అయినా అన్నాడు: "అయినా ఆవేదన పూరుకోదు గదా!"

"ఎంత ఆవేదన అయినా, నాలుగు రాళ్ళు సంపాదించి పెట్టని రచనలు ఎందుకు చెప్పండి? మొదలు కవిని బాగుచేయని ఈ కవిత్వం, కథలూ ఏం లాభం! ప్చ్! పనికొచ్చే పనేదైనా...." శాస్త్రి మాటలు కడుపునిండిన లావాటి నల్లి కదిలికలా మెల్లి మెల్లిగా కదిలి చెవుల్లోకి దూరాయి.

ఆత్మారావు తటాలున లేచి, "వస్తాను మళ్ళీ," అనుకుంటూ గుమ్మం దాటాడు.

"పాపం! వొట్టి అమాయకుడు. ఆవేశపరుడు," అనుకున్నాడు శాస్త్రి, దళసరి అద్దాలను తీసి పంచెతో తుడుస్తూ....

ఆత్మారావు ఆత్మ వొణికిపోతోంది. కాళ్ళు మాత్రం కదులుతూనే ఉన్నాయి సిమెంటు రోడ్డుపైన....తనని బాగుచేయని రచనలు ఎందుకు? నిజమే చివరికి తనకు అప్పుచేసి పెట్టని ఈ కవిత్వం ఎందుకు? నేను యేమి వ్రాస్తే ఎవడిక్కావాలి! ఈ దున్నపోతు సంఘం హాయిగా తిని నెమరు వేస్తుంది. తాను అప్పు అడిగితే బుస కొడుతూ తరిమికొడుతుంది. దాని ముక్కుల గుండా డబ్బుతాడు ఓసించి ఈ వ్యవస్థ లాక్కెళ్ళుతోంది.

తాను ఇంతవరకు వ్రాసినవి, సంపాదించి పెట్టింది ఏమిటి? కాఫీ ఖర్చులకు మాత్రం, సిగరెట్లకు మాత్రం అదుకున్నాయి అప్పుడప్పుడు వచ్చిన పారితోషికాలు. ఏదో రచన వస్తే యెదిరి చూడడం మిగిలిపోయింది ప్రతిఫలంగా—డబ్బు ఏ వాటికో—ఎంతో—యెప్పటికో? ఛ.... ఛ....తాను వృత్త డబ్బులకోసం రచయిత కాడే—ఆత్మారావు ఆత్మ తనను తాను సముదాయించుకుని ధైర్యం చెప్పింది.

ఇప్పుడు బస్సు దిగి ఈ చౌరస్తాలో అవిటివాడిలా నిలుచున్నాడు ఆత్మారావు. పొద్దున తాగిన కాఫీ ఎప్పుడో ఆవిరై ముఖాన చెమట పట్టింది. మెల్లిగా నీరసంగా కదులుతూ ఆకలితో, చీదరగా నోరు చప్పరిస్తూ ఆత్మారావు తనతో పనిచేస్తున్న మరోఉపాధ్యాయుడి ఇంటి గుమ్మంముందు నిలుచున్నాడు.

మధ్యాహ్నం భోజనానికి స్కూలు దగ్గర్లోనేవున్న ఇంటికి వచ్చిన ఆ టీచర్ గుమ్మంలోనే కలిశాడు. ఆత్మారావు వాలకం పసిగట్టి బిక్కమొగం వేశాడు. అతను కూడా చివరికి లేవన్నాడు. అతను ఆ సాయంత్రం రేషన్ తెచ్చుకోడానికే పది రూపాయలు అప్పు తెచ్చుకున్నానని జేబులోనుండి నోటు తీసి చూపించాడు.

ఆత్మారావు ఆత్మలోని కాలు మరోసారి విరిగింది. మరోసారి కుంటివాడిలా దిక్కులు చూస్తూ నిలుచున్నాడు. నిస్పృహతో వెనక్కితిరిగి నడవడం మాత్రం చేస్తున్నాడు. దూరంగా రోడ్డుపక్క ఉన్న బావి పిట్టగోడపక్క జనం. ఆత్మారావు అనాయాసంగానే అటువైపు నడిచి గుంపులో నిలుచున్నాడు. పక్కనే వున్న రిక్షావాలాను అడిగాడు యేమిటని! అతను బావిలోకి చూపెడుతూ, "ఎవరో లంబాడిది సార్! ఎప్పుడు పడిందో బాయిలో-అగ్గో పీనుగ అక్కడ తేలింది," అన్నాడు.

ఆత్మారావు మోటబావి లోకి తొంగి చూశాడు. ఎవరో ఎర్రని బట్టను నీళ్ళతో ముంచి పైకి తీసినట్టు తేలుతున్న శవం. బావిచుట్టూ అప్పుడప్పుడే పెరుగుతున్న వరిచేలు. మోట దగ్గర, పైన కూర్చుని ఒక మనిషి చూస్తున్నాడు. శవం ఒక వింత. ఆత్మారావు నోటిలో నుండి ప్చ్....ప్చ్.... అని నిట్టూర్పులు, అలవాటు ప్రకారంగా గాలిలోకి కలిసిపోయాయి.

"మొన్ననే ఇక్కడే రోడ్డు పక్క చచ్చిపడిన పసికందు కనపడిందట. గడ్డిలో పెట్టి తెల్లని బట్టనిచుట్టి యెవరో అప్పుడే పుట్టిన పసిగుడ్డును గొంతు పిసికేసి పడేశారు" అని యెవరో ఒకతను స్నేహితునితో చెబుతున్నాడు.

ఎవరి కోరికకో పొట్టలో మాంసం ముద్దగా పెరిగి, నల్లని రక్తం గడ్డగా బయట మట్టిలో కలిసిపోయిందన్నమాట అని ఆత్మారావు అనుకున్నాడు.

ఆత్మారావు ఆత్మ కాసేపు వణికి వూరుకుంది. మళ్ళీ కాస్సేపటికి గుంపులో యెక్కడో తప్పిపోయింది. శరీరం మాత్రం నిర్వికారంగా నిలుచుని శవాన్ని




చూస్తోంది. ఎన్నో భ్రూణహత్యల, ఆత్మహత్యల మధ్య నడుస్తున్న దేశం యంత్రం. ఎన్నో ఆకలిమరణాల మధ్య ప్రాణం నిలుపుకుంటున్న పవిత్ర దేశం. రోజూ క్యూల్లో జీవం పోసుకుంటున్న మనుష్యుల దేశం. పార్టీల పేరుతో మనుష్యుల భుజాలపై ఊరేగుతున్న తోలుతిత్తులు. ఎడమ, కుడి భేషజాలతో సామాన్యులను సిద్ధాంతాల సమాధుల్లో పూడ్చేస్తున్న నాయకులు. ఇన్నేళ్ళ తర్వాత కూడా దారిద్ర్యాన్ని కొల్లగొడుతున్న సామ్యవాద—సమాజవాద— భూస్వామ్య పెట్టుబడిదారులు.

ఆత్మారావు తలలో జోరీగ ఝుయ్యిన తిరుగుతూనే ఉంది గుంపులోంచి విడివడి నడుస్తూ సాగిపోతూనేవుంది. తన కథలూ,-కవిత్వాలూ, అన్నీ వొట్టి గుడ్డపేలికలని, రోజూ తేలుతున్న శవాల్లాంటివని, రోజూ కుతుక పిసుక్కుని నీళ్ళలో చుయ్యిమని చల్లారుతున్న వేడి ఇనుప శలాకాలని ఆత్మారావుకు అనిపించింది. తనకు తాను ఈ దేశంలో తనకే ఒక భారమై రోజూ జీవిస్తున్నాడు. ఏ నెలకానెల అప్పులు చేయడంతో వడ్డీలను కట్టడంతో, మిగిలిపోయిన సత్తువతో భూమిపై నిలుచున్నాడు. ఈ శవాగారణలాంటి బ్రతుకుపై తనకే అసహ్యం వేస్తోంది—పొదుపుగా బ్రతికితే .? అంటే తాను

తినడం మానేయాలి, లేకపోతే సిగిరెట్లూ, కాఫీలూ మానేయాలి-అయినా అలా కూడే డబ్బు ఏనాటికి పేరుకున్న అప్పులను తీర్చగలదు?

ఎదురుగా రెండు కుక్కలు రోడ్డుపై పొర్లాడుతూ ఒకదానిపై ఒకటి పడుతూ నడుస్తున్నాయి. మగకుక్క ఆడకుక్క వొంటిని నాలుకతో నాకుతోంది

ఆత్మారావు శరీరం జలజిలామని వణికింది. తానూ అంతే! రోజూ ఎలాగో తిని రాత్రికి కోరిక మేలుకున్నప్పుడల్లా భార్య శరీరాన్ని ఇలాగే నిమురుతాడు. బద్ధకంగా కళ్ళు మూసుకున్న భార్య దగ్గరగా జరుగుతుంది. తాను ఆనందంతో కాకుండా అప్పులను మరచిపోడానికి గట్టిగా కౌగలించుకుంటాడు. తనకే తన కౌగలింతలో బలంలేదని కోపం వస్తుంది. విసుగుతో భార్య శరీరాన్ని వొదిలి దూరం జరుగుతాడు. తాను కుక్కకంటే అన్యాయంగా, అసంతృప్తిగా జీవిస్తున్నాననే యధార్థం ఆత్మారావుకు బోధపడింది.

మరో చౌరస్తాకు చేరుకున్న ఆత్మారావు మూలలో వున్న ఇరానీ హోటల్లోకి వెళ్ళి కూచున్నాడు. గోడలపై తెల్లని కాగితాలపై పెద్దపెద్ద నల్లుల మరకల్లా అక్షరాలు—"10 అక్టోబరు నుండి టీ ధర 20 పైసలు" బస్సు చార్జీలు కూడా పెరిగిన సంగతి ఆత్మారావుకు చప్పున జ్ఞాపకం వచ్చింది. పెరుగుతున్న ధరల బారోమీటర్‌లోని పాదరసాన్ని పైపైకి యెగదోస్తున్న సూచన. ప్యాంట్ జేబులో చేయివేసి వేళ్ళతో ఆలోచించాడు. సరిగ్గా ఇరవై అయిదు పైసలకు సరిపోయే బిళ్ళలు.అయిదు పైసలిచ్చి రెండు చార్మినార్ సిగిరెట్లు తెప్పించుకుని మరీ కూచున్నాడు. సర్వర్ తెచ్చిన చాయ్‌ను చప్పరిస్తూ, టేబిల్‌పై వున్న వార్తాపత్రిక అక్షరాల కొంతర్లపై దొర్లిపోయాడు కాస్సేపు . వియత్నాంలో విమానాలరొద ...దేశంలో రాజకీయాలు మారుస్తున్న రంగులు . ఇంకా .ఇంకా .. ఆత్మారావు కాసేపు ఆగి చదవడం మానేశాడు. పైకి తలఎత్తి చూశాడు. ఎదురుగా ఆ మధ్యనే పరిచయమైన యువ సర్దార్జీ నిలబడి వున్నాడు. చూడగానే అతను వచ్చి, "కహియే రావు సహాబ్," అని హిందీలో అడిగి, పక్కనే వచ్చి కూచున్నాడు.

"హల్లో—హవుడుయూడూ మిస్టర్ తేజ్‌సింగ్?" అని ఉత్సాహాన్ని పుంజుకుని చేయి అందించాడు ఆత్మారావు.

"ఏమిటి అలా వున్నారు? చాలా నీరసంగా కనపడుతున్నారు! అంతా బాగా వుందనే అనుకుంటాను!" తేజ్ ప్రశ్నించాడు.

ఆత్మారావు చిరునవ్వుతో ముఖాన్ని వెడల్పు చేశాడు. చివరికి తనలో కాస్సేపు గింజుకొని, లోపలి అభిమానానికి ఏనాడో విడాకులు ఇచ్చుకున్న ఆత్మారావు అడిగాడు, "తేజ్! ఏమైనా డబ్బు సహాయం చేయగలుగుతారా?"

తేజ్ బిగుసైన గడ్డం మరీ బిగుసుకు పోయింది.

"ఏమని చెప్పమంటారు? నా చేతులకే సంకెళ్ళు వున్నాయి. సమస్యలు మీవీ, నావీ ఒకటే. తేడా ఏమిటంటే మీకు అప్పు అడిగే ధైర్యం వుంది. నాకు లేదు."

ఆత్మారావు అభిమానం మరోసారి లోపల రక్తం చిందిన నల్లిలా గిలగిల లాడింది.

"అది సరే, మిస్టర్ ఆత్మా! మీరు కూడా కవులు కదా. ఒక విషయం చెబుతారా?" అని తేజ్ అడగ్గానే ఆత్మారావును ఎవరో బూతు తిట్టినట్టు అనిపించింది ఈ దేశంలో కవి అంటే నపుంసకుడని అర్థం.

తేజ్ అడిగాడు— "ఇంతకు మన తరం సాధించింది ఏమిటి?"

"అప్పులు—కొన్ని చచ్చిన నల్లులు." ఆత్మారావు వెంటనే తడుముకోకుండా అన్నాడు.

తేజ్ నవ్వి అన్నాడు—"కొన్ని రాజకీయ నినాదాలు కూడానేమో? ఇక మీరు చెప్పింది నిజమే కాని—మరొకటి అనిపిస్తోంది. ఈ తరం సాధించింది ఇతరులను బాధపెట్టకుండా తన కాళ్ళపైన తాను నిలుచుని వెంట్రుకలు పీక్కోడం."


ఆత్మారావు—"మీ ఉద్దేశం ఇతరులను అప్పు అడక్కుండా ఆత్మహత్య చేసుకోడం మేలనా?"

"నో! నో! మీరు నా పాయింట్ గ్రహించలేదు. కనీసం అప్పుచేసైనా వడ్డీలుకట్టి నిజాయితీగా బ్రతకవచ్చు. మన సమస్యల సిలువ మీద నెత్తురుకార్చే ఏసు ప్రభువులం మనం—ఆమెన్!" అని పెద్దగా నవ్వాడు తేజ్‌సింగ్.

"ఈ యుగం ఆలోచించి బాధపడే యువకులని విదూషకులుగా కూడా మార్చివేసిందనుకుంటాను" ఆత్మారావు సీరియస్‌గా అనుమానం వెలిబుచ్చాడు.

"అనుమానం ఎందుకు? తప్పకుండా విదూషకులమే మనమంతా! కనీసం చందాలపై బ్రతికే నాయకులం కాదు మనం. కార్మికులను మోసంచేసి, యజమానుల లంచాలమీద పొట్టలను పెంచే కార్మిక నాయకులం అసలు కాము. కనీసం మనమంతా అస్తిత్వం కోసం ఘర్షణ జరుపుతున్నాము." తేజ్ కళ్ళు మండుతున్నట్టు మెరిశాయి—"ఏమైనా, మిస్టర్ ఆత్మా! నల్లుల్లా కతికి కతికి బ్రతికే మనుష్యులకి ముక్తి మార్గం ఒక్కటే — విప్లవం! సాయుధ విప్లవం మాత్రమే ఈ నాటికి మిగిలిన దారి"

ఆత్మారావు అనిశ్చయంగా ఆగి ఆగి తన మనసులోని మాట చెప్పాడు—"ఆవేశంతో మాట్లాడుతున్నారు, తేజ్! మీకు చైనా ఆదర్శం కావచ్చు - ఇంకోడికి రష్యా ఆదర్శం కావచ్చును—మరొకడికి అమెరికా—నాకు మాత్రం ఈ నల్లులు నిండిన భారతదేశమే ఆదర్శం. ఈ దేశంపై ప్రసరించే ఇక్కడి సూర్యుని కిరణాలు మాత్రమే ఈ నల్లుల్ని మాడ్చి కొల్లగొట్టబడని వ్యవస్థను నిర్మిస్తాయి."




తేజ్‌సింగ్ మళ్ళీ అవిశ్వాసంగా నవ్వాడు. ఆత్మారావు విశ్వాసం అనిశ్చయం లోనే ఊగిసలాడుతోంది. గడియారం సాయంత్రం నాలుగును సూచిస్తున్నది. ఆత్మారావు లేచి "సో! మళ్ళీ కలుద్దాం," అని బయటికి నడిచాడు.

ఛ! వృత్త అనవసరం చర్చలు. సమయానికి అప్పుకూడా పెట్టలేని పరిచయాలు. పైగా కొత్త విషయం ఏదో కనిపెట్టినట్టు ఉపన్యాసాలు. ఈ రచయితలకు, కవులకు వాంతివస్తే గబాలున వాంతి చేసుకున్నట్టు- తలనొప్పి లేస్తే ఏదో బిళ్ళ మింగినట్టు— నరాలు జివ్వుమంటే పెళ్ళాం దగ్గర పడుకున్నట్టు.... అప్పుడప్పుడు ఏవో గిలుకుతుంటారు.... అవే మాట్లాడుతుంటారు.... ఆత్మారావు ఆత్మలోని స్రవంతి ఒక్కసారి తెగింది. తాను మాత్రం ఏ విధంగా వాళ్ళందరికి భిన్నమో అర్థం కాలేదు. దగ్గర్లోనే వున్న మరో కవిమిత్రుని దగ్గరికి వెళ్ళాడు. ఈ కవిమిత్రుడు హింసా మతావేశం వున్న యువకుడు. ఆత్మారావుకు అతని రచనలపై ఏ మాత్రం సదభిప్రాయంలేదు. అయినా అతని బంధువు ఒక పాతకాలం నాటి వార పత్రిక సంపాదకుడు. ఒక ప్రచురణ సంస్థకు యజమాని. ఆత్మారావు ఆ మధ్య వ్రాసిన నవలను ఆయన ప్రచు

రిస్తానన్నాడు తాను సహించని రచనలు చేసే ఛాద స్తపు రచయితతో ఒప్పందం దేనికోసమంటే బ్రతకడం కోసం- లొంగు బాటుతో ఒప్పందం ఇలా ఒప్పందం చేసుకుంటూపోతే వేడి, వాడితనం ఇంకా ఏమి మిగులుతాయి?

ఈ డబ్బు అవసరాన్నీ, అప్పు సమస్యలనూ ఎదుర్కోడానికి తాను చివరికి ఒకప్పుడు ఆత్మను పాతేసి అక్రమ ఆదాయానికి లొంగిపోయిన రోజులు కనిపించాయి ఒక ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్‌తోపాటు తానూ పిల్లలకోసం ఎచ్చిన పాలపొడిని అమ్మి కొంత డబ్బు కళ్ళ చూసి, పైకి ఆనందించానని అనుకున్నాడు కాని తనకు లోపల ఏవేవో ఆయువుపట్లు విరిగిపోతున్నట్టు, నిజాయితీని బూకరించి బ్రతుకుతున్నట్టు తనకుతానే నిదర్శనమని అనిపించింది తనను లోపల హత్య చేసుకునే ఈ ఘోరకిరాతక జీవితము తన చేతులారా సాధ్యంకాదని తెలుసుకున్నాడు హెడ్మాస్టర్‌ను హెచ్చరించి తాను సొంతాన్ని నరుక్కునే కార్యక్రమంలో పొగ్గాని, అమాయకులైన చిన్న పిల్లల నోళ్ళు కొట్టి దలుచుకోలేనని చెప్పి దూరం జరిగాడు ఫలితం కొంతకాలానికి హెడ్మాస్టర్ మోసం బయటపడి ఊరి వాళ్ళతో తన్నులు తిన్నా, తాను మాత్రం గౌరవంగా అప్పుల జీవితానికే అంకితమై పోయాడు

ఇంట్లోనే వున్న కవిమిత్రుడు శర్మ బయటికి వచ్చి ఆత్మారావు చెప్పినదంతా విన్నాడు 'సరే నడవండి,'అని తన బంధువు పత్రికా కార్యాలయానికి తీసుకెళ్ళాడు

శర్మ చెప్పినదంతా విని ఆ పత్రికా సంపాదకుడు తల ఆడించాడు నవలను ప్రచురించేవరకు ఏమీ ఇవ్వలేనని చెప్పాడు —"శర్మా! నీవు మధ్యలో వున్నావు కాబట్టి ఏదో పారితోషికం ఏర్పాటు చేస్తాను ఒక నూట పదహార్లు ఇస్తాననుకో—మరి నీ పూచీ కావాలి." శర్మ తటపటాయించి ఆత్మారావును చూశాడు ఆత్మారావు వెంటనే అతన్ని పక్క గదిలోకి తీసుకెళ్ళి,"చూడు, శర్మా! నీ దగ్గర నా నవల ఉంది ఇంకేం అనుమానం? నాకు వెంటనే ఆ నూట పదహార్లు ఇప్పించు మధ్య నీ పైననే కదా నా నమ్మకం నీకు నమ్మకం లేదా నా మీద?"అని ఆత్మారావు నిలదీయగానే, శర్మ సందిగ్ధంగానే, "అది కాదనుకోండి డబ్బు విషయం కదా! బిజినెస్‌లో అసలు వ్యవహారం కుదరకుండా " అన్నాడు

"నీ కెందుకు, నవల వేయకుంటే మరే చోటైనా అప్పుచేసి ఆ పారితోషికాన్ని బదులు తీరుస్తాను నీవు ఇప్పుడు డబ్బు ఇప్పించావంటే చాలు!" ఆత్మారావు ఇంకా ఏమాత్రం సహనం లేని వాడిలా మాట్లాడాడు

చివరికి శర్మ పూచీపడగానే సగం మొత్తం యాభై ఎనిమిది రూపాయలు మాత్రం దొరికాయి రెవిన్యూ స్టాంపుపై సంతకంచేసి అంత మొత్తం తీసుకున్నట్టు ఆత్మారావు అక్షరాల్లో విశ్వాసాన్ని వ్రాసి ఇచ్చాడు

నాలుగైదుసార్లు థాంక్స్ చెప్పి బయటికి, అప్పుడే జైలు గేట్లు తెరుచుకుని వచ్చిన ఖైదీలా, వచ్చేసాడు



ఈ రోజు సాయంత్రం వచ్చిన ఎంజరి వడ్డీవ్యాపారి యెదుట ధైర్యంగా నిలుచుని కొంత వడ్డీ ఇచ్చాడు ఆ నెల ఇంటి అద్దె చెల్లించాడు ఆత్మారావు.

ఈ రాత్రి మళ్ళీ రాత్రంతా నల్లుల మధ్య పడుకునే ముందు రోజూ నల్లుల మందు కొట్టి వాటిని దూరం చేయాలని అనుకుంటాడు కాని అంత ఓపిక పడుకునే ముందు ఎక్కడా వొంట్లో మిగలదు కాస్సేపు కరుస్తున్న నల్లుల మధ్యనే శరీరాన్ని కదిపి చేతుల్ని చాచి మండిన చోట కసిగా అదిమి నల్లిని పట్టాలని చూస్తాడు గుడ్డిగా చీకట్లో చేతిని అలికి మళ్ళీ సర్దుకుంటాడు భార్య గుర్రుపెడుతూ నిద్రపోతోంది తన సమస్యలతో ఈ మనిషికి ఏం సంబంధం? వండిపెట్టి, దాహాన్ని తీర్చి, అంతటితో అలసి నిశ్చింతగా నిద్రపోయే అర్ధాంగి అర్ధాంగి ఎందులోనో అర్ధంకాలేదు ఆత్మారావుకు శరీరాన్ని పంచుకుంటే పంచుకుంటుందేమో మరి మనస్సును?

మళ్ళీ సన్న నల్లులు—లావు నల్లులు గోడలపై నుండి కిందికి పాకుతున్నాయి. ఆత్మారావు కళ్ళు భగ్గునమండి సహాసం వచ్చింది కోపంతో పెన్ను తీసి కసిగా వ్రాయడం మొదలు పెట్టాడు

వినమే గద దోసిళ్ళ కొద్దిగ
దొరుకుతుందని
ప్రతి మిత్రుడి ఇంటి ముందు
పడిగాపులుగాచి
వేడి వేడి కన్నీటిని జార్చుకున్నాను
నా ఆశాంకురాలను విశ్వాసానికి
బలిచేసాను

కనీసపు మానవ విలువలు మార్చారు
మనుష్యులు
పొరపొరలు పోతోంది మనస్సు
గొంతు పగిలేట్టు ఏడ్వాలనిపిస్తోంది
తీరని ఆకలి, గడవక పూటలు
చేశాను అప్పులు
కృత్రిమ జీవిత పద్ధాను కప్పుకోలేదు
తాగి తప్ప తూల లేదు
స్నేహాన్ని నమ్ముకున్నాను—
చేతులు కాల్చుకున్నాను
దారి చూపించే వాళ్ళ కళ్ళ
పొడుస్తారనుకోలేదు
ప్రొద్దు పొడుపు నుండి అర్థరాత్రి
వరకు తిరిగి తిరిగి
అలసత్వం నిండిన అవయవాలతో
చేరి ఇల్లు
వాళ్ళ మరచి పండ లేదు—
రుణదాతలను మరవలేదు
పెదాల మీంచి దైవత్వం చిరునవ్వు
చెరిగిపోతోంది
నా లోని దానవుడు నడచి పోతున్నాడు
ప్రజాస్వామ్య సిద్ధాంత కర్తల మిత్రుణ్ణి
ఈ నాడు ఇట్లా రాచవీధుల వెంట
శవాన్నై ఊరేగుతున్నాను

కలం మూసి దుప్పటి కప్పుకున్నాడు ఆత్మారావు చీకట్లో బెడ్‌లైట్ గుడ్డి వెలుతురు కాలిపై నల్లిపారిన కదలిక కోపంతో కాలు మడిచి చేతితో గుద్దాడు లోపలి నల్లి చితికి పైకి రక్తం ముద్ద ఉబికింది తాను శవాన్ని అని జ్ఞాపకం వచ్చింది కుడి వైపుకు మరలి పడుకున్నాడు మళ్ళీ గుండెపై ఏదో కదలిక తనకు మిగిలిన ఆస్తి తన గుండెపైని రోమకసామ్రాజ్యం. ఆ రోమాల్లో చిక్కుకుని, దారీ తెన్నూ తెలియక కొట్టుకుంటున్నది నల్లి లేచి రోమాలలోంచి ఆ నల్లికి ముక్తి ప్రసాదించాడు కళ్ళు మూసుకున్నాడు .

ఉదయమే లేవగానే ఆత్మారావు రాత్రి తాను కవిత్వంలా వ్రాసిన వాక్యాలను చదువుకున్నాడు లోపల పెద్దగా నవ్వుకుని చుట్టూ చూసాడు చప్పగా, చట్టగా చతికిల బడిపోయిన నల్లులు పది పదిహేను పడి వున్నాయి అప్పు తాను తనను ఉద్ధరించుకోడం కోసమే చేసినా మంచిగా బ్రతకాలనే! ఇన్ని బాధలూ, ఇంత సిగ్గులేనితనం, ఇంత ఆత్మాభిమానం, వచ్చిన జీవితంతో మిగిలిన తనకు మిగిలింది లోపల కాలుతుండే ఆత్మ ఒక్కటే సమస్యలు ఏ రాత్రికి ఆ రాత్రి వచ్చి, కరచి, రక్తం త్రాగి, రంధ్రాల్లో మత్తుగా పడివుండే నల్లుల్లా, ఏ నెల కా నెల కరుస్తూనే వున్నాయి అన్నిటిని ఒక్కసారే అరచేత్తో నలిపేస్తే?

లేదు! తాను నల్లిలా కతికి బ్రతకడం లేదు కనీసావసరాల కాలువల్లో తిరుగుతూనే, ఈ వడ్డీల వలయంలో పల్టీలు కొడుతున్నాడు నల్లులను నాశనం చేయాలంటే తన ఈ కొంపనే కాల్చితే? చివరికి అద్దె కొంప కూడా మిగలదు

ఈ నల్లులకు భయపడి పలాయనం చిత్తగిస్తే, ఎక్కడైనా దేశంనిండా నిండిన నల్లులు ఏమాత్రం వదలవు అందుకే ఈ వలయంలోనే కతికిన నల్లులను వుల్లతో గిలికి, గిలికి, నలిపి నేలమట్టం చేయాలి!

———